నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, శుక్రవారం 24 జనవరి 2025 RANGAREDDY

## రాత్రికి రాత్రే జాబితాను మార్చారు..



ఆదిబట్లలో కొన్నేండ్లుగా కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నా. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా.. అధికారులు నిన్న చదివి వినిపించిన జాబితాలో పేరు వచ్చింది. అయితే మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ రోజు వేసిన జాబితాలో తన పేరు రాలేదు. రాత్రికి రాత్రే ఆ జాబితాను తారుమారు చేశారు. తమకు ఎలాంటి ఆస్తులు, భూముల్లేవు, రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి.

-మదిలేటి, ఆదిబట్ల మున్సిపాలిటీ

## అక్రమ అరెస్టులు తగవు



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలి. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే అక్రమంగా అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదు. అక్రమ అరెస్టులు చేస్తే ఊరుకునేది లేదు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందించి ఆదుకోవాలి. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను త్వరగా అమలు చేయాలి.

-బుట్టి చంటి..



మంబాపూర్‌లో గ్రామసభ కోసం ఏర్పాటు చేసిన స్టేజీపై అధికారులతో కలిసి కూర్చున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

# మూడో రోజూ.. మర్లబడ్డరు..

- గందరగోళంగా కొనసాగిన గ్రామ, వార్డు సభలు
- తమ పేర్లు రాలేదంటూ అధికారుల నిలదీత
- భూములు, ఇండ్లు, కార్లున్న వారి పేర్లు రావడంపై మండిపాటు
- పలుచోట్ల పోలీసుల కనుసన్నల్లో గ్రామసభలు



తమ పేర్లు జాబితాలో ఎందుకు రాలేదని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న మహిళలు

రంగారెడ్డి, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో మూడో రోజూ గందరగోళం మధ్యనే గ్రామ, వార్డు సభలు జరిగాయి. గురువారం పలు మండలాలు, మున్సిపాలిటీల్లో సభలు కొనసాగగా.. తమ పేర్లు రాలేదంటూ అనేక మంది అధికారులను ఎక్కడికక్కడ నిలదీశారు. అర్హులను విస్మరించి పైరవీకారులు, నాయకులు చెప్పిన వారి పేర్లు మాత్రమే వచ్చాయని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రి ప్రసంగం ముగించుకుని తిరిగి వెళ్లిన తర్వాత అక్కడున్న మహిళలు తమ పేర్లు రాలేదంటూ అధికారులను నిలదీశారు. అర్హులకు కాకుండా భూములు, ఇండ్లు, కార్లున్న వారి పేర్లు మాత్రమే రావడమేమిటని మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డితోపాటు అక్కడున్న కౌన్సిలర్లను ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అర్హులకే ఇస్తామని చెప్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు కిందిస్థాయిలో మాత్రం అనర్హులకు పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు.

యాచారం మండలంలోని నల్లవెల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో తీవ్ర గందరగోళం నెలకొన్నది. ఇండ్లు, రేషన్‌కార్డులకు సంబంధించి రూపొందించిన జాబితాలో అర్హుల పేర్లు లేవని..ఇష్టానుసారంగా ఇతరుల పేర్లు రాసి పేదలకు తీవ్ర అన్యాయం చేశారంటూ స్థానికులు అధికారులను నిలదీశారు. అలాగే, మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామంలో జరిగిన గ్రామసభలోనూ అర్హులకు అన్యాయం జరిగిందంటూ మహిళలు అధికారులను నిలదీశారు. సంక్షేమ పథకాలు పేదలకు కాకుండా ధనికులకు ఇస్తున్నారని ఆరోపించారు. మొయినాబాద్ మండలంలోని పెద్ద మంగళారం గ్రామంలో కూడా ఇండ్లు, రేషన్ కార్డుల జాబితాలో అర్హులకు కాకుండా అనర్హులకు ప్రాధాన్యమిచ్చారని ప్రజలు అధికారులను నిలదీశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఇనాంగూడ, బాటసింగారం తదితర గ్రామాల్లోనూ అర్హులవి కాకుండా ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెప్పిన వారి పేర్లు మాత్రమే చదివి వినిపిస్తున్నారని, అర్హులకు అన్యాయం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్ గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు గ్రామంలో గురువారం పోలీసు పహారా మధ్య గ్రామసభ జరిగింది. గ్రామసభను అడ్డుకుంటారన్న ముందస్తు సమాచారంతో పోలీసులు పలువురు స్థానికులను ముందుగానే అరెస్టు చేశారు. అర్హుల జాబితాలో తమ పేర్లు రాలేదని, పలువురు అధికారులను నిలదీయగా పోలీసులు జోక్యం చేసుకుని వారిని అక్కడి నుంచి పంపించేశారు.

## పోలీసుల కనుసన్నల్లో గ్రామసభలు

జిల్లాలో గ్రామసభలు పోలీసుల కనుసన్నల్లో సాగుతున్నాయి. ప్రజలు సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తే వెంటనే వారిని అక్కడి నుంచి పోలీసులు పంపించేస్తున్నారు. అలాగే, పేదలకు కాకుండా ధనికులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎవరైనా అధికారులను నిలదీస్తే పోలీసులు జోక్యం చేసుకుని వారిని గ్రామసభల నుంచి మరోచోటుకి పంపిస్తున్నారు. కాగా ఎలిమినేడు గ్రామంలో అధికారులను స్థానికులు ప్రశ్నిస్తారని గుర్తించిన పోలీసులు పలువురిని ముందుగానే అరెస్టు చేశారు.

## హామీలు అమలు చేయమంటే అరెస్టులా..?



ఎలిమినేడు గ్రామంలోని చాలామంది రైతులు కంపెనీల ఏర్పాటు కోసం తమ భూములు ఇచ్చారు. అయితే ప్రభుత్వం మాత్రం సరైన పరిహారాన్ని ఇవ్వలేదు. గత కొంతకాలంగా పరిహారాన్ని పెంచాలని ఆందోళన చేస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు రైతుల భూములకు పరిహారాన్ని మరింత పెంచుతామని..ఎకరాకు 120 గజాల చొప్పు న ఇంటి స్థలాన్ని ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని గ్రామసభలో అడిగేందుకు వెళ్తామనుకుంటే పోలీసులు ముందుగానే అరెస్టు చేశారు. రైతులకు జరిగిన అన్యాయంపై గతంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్లలో ఫిర్యాదులు చేసినా న్యాయం జరగడం లేదు. ప్రభుత్వం తమ గొంతు నొక్కుతున్నది.

-శ్రీకాంత్‌రెడ్డి, భూ పోరాట సమితి అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం రూరల్

యాచారం : నల్లవెల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



## కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు..




ఆదిబట్ల గ్రామంలో అర్హులైన వారికి ఇండ్లు, రేషన్‌కార్డులు రాలేదు. అర్హత లేని వారికి మాత్రమే వచ్చాయి. ఈ విషయాన్ని మంత్రికి చెప్పేందుకు వెళ్తుంటే కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలి. తనలాంటి పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు ఇవ్వాలి.

-సంతోష, ఆదిబట్ల మున్సిపాలిటీ



ఇబ్రహీంపట్నంరూరల్ : ఎలిమినేడులో గ్రామసభను అడ్డుకుంటున్న స్థానికులు, రైతులు



ఇబ్రహీంపట్నంరూరల్ : రాయపోల్ గ్రామంలో గ్రామసభను అడ్డుకుంటున్న స్థానికులు

# స్టేజీలపై కూర్చుని.. గ్రామసభలను నిర్వహిస్తూ..

## కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లను తలపిస్తున్న గ్రామసభలు

### అధికారులతో కలిసి దర్జాగా స్టేజీపై కూర్చున్న కాంగ్రెస్ మండల, గ్రామ కమిటీల అధ్యక్షులు

పెద్దేముల్, జనవరి 23 : మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న గ్రామసభలు కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లను తలపిస్తున్నాయి. మొదటిరోజు జరిగిన గ్రామసభ గోపాల్‌పూర్ గ్రామంలో తప్పా.. మిగిలిన గ్రామాల్లో స్టేజీలు వేసి.. వాటి పై కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, మాజీ ప్రజాప్రతినిధులు దర్జాగా కూర్చుని అధికారులతో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. తాజాగా గురువారం మంబాపూర్ గ్రామంలో జరిగిన గ్రామసభలోనూ అదే తంతు కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు, మాజీ ప్రజాప్రతినిధులు స్టేజీపై కూర్చున్నారు. అధికారులు, నాయకులకు ఎదురు చెప్పలేక.. వారు చెప్పిందే వేదంలా కానిచ్చేస్తున్నారు. అధికారులు ప్రజలకు చెప్పాల్సిన సమాధానాలను కూడా వారే మధ్యలో కల్పించుకుని చెప్పడం పలు విమర్శలకు దారి తీస్తున్నది. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులకు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు మధ్య గొడవ జరుగగా పోలీసులు కలుగజేసుకొని గొడవ పెద్దది కాకుండా చేశారు. ఇక శుక్రవారం జరిగే గ్రామసభలనైనా అధికారులు సక్రమంగా నిర్వహిస్తారో లేదో చూడాలి.



లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ (ఫైల్)

# కొత్త రేషన్ కార్డులకు భారీగా దరఖాస్తులు

- వికారాబాద్ జిల్లాలో రేషన్ కార్డుల కోసం సుమారు లక్ష మంది అర్హుల ఎదురుచూపు
- కేవలం 23,000 మందినే అర్హులుగా తేల్చిన సర్కారు
- గ్రామ, వార్డు సభల్లో రెండు రోజుల్లోనే వచ్చిన దరఖాస్తులు 28,189 ..మరింత పెరిగే అవకాశం

వికారాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై నిరసనలు, నిలదీతలు కొనసాగుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో వ్యవహరించిన తీరుపై ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. పై నాలుగు పథకాలకు సంబంధించి ఈ నెల 24 వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి, ఈనెల 26న వాటిని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అర్హులు చాలామంది ఉండడంతో కొంతమందికే లబ్ధి చేకూర్చేలా యత్నించగా.. గ్రామ, వార్డు సభల్లో ప్రజలు తమకూ వర్తింపజేయాలని డిమాండ్ చేయడంతోపాటు అధికారులను నిలదీస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల విషయంలోనూ అర్హుల్లో సగం మందిని కూడా ఎంపిక చేయకపోవడంతో వారి నుంచీ నిలదీతలు, నిరసనలు వ్యక్తం అవుతుండడంతో దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించారు.

### రెండు రోజుల్లో 28,189 దరఖాస్తులు

కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లావ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. రెండు రోజుల్లోనే 28,189 అప్లికేషన్లు రాగా.. నేటితో గ్రామ, వార్డు సభలు ముగియనున్న దృష్ట్యా వాటి సంఖ్య 50,000 దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే కేవలం 23,000 మందికే కొత్త కార్డులను జారీ చేసి చేతులు దులుపుకొందామనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు షాకిచ్చారు. కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోగా కొద్ది మందినే ఎంపిక చేశారని మండిపడుతున్నారు. జిల్లాలో దాదాపుగా లక్ష మంది వరకు వాటి కోసం నిరీక్షిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూసే వారి సంఖ్య వందకుపైగా ఉన్నా కేవలం కొంతమందిని మాత్రమే అర్హుల జాబితాలో పొందుపర్చడం గమనార్హం. ప్రజాపాలన సమయంలో రేషన్ కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుదారుల వివరాలు సర్వే సమయంలో కనిపించకపోవడంతో.. ఇండ్లకు వచ్చి సర్వే చేస్తున్న అధికారులను స్థానికులు నిలదీస్తున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అంటూ పత్రిక ప్రకటన విడుదల చేసి దాటవేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇది కోత విధించడంలో భాగంగానే సగం మందిని దరఖాస్తు చేసుకున్న జాబితాలో లేకుండా చేశారంటూ ఆరోపణలు వస్తున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, చిత్రంలో పక్కన నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

## అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి

### వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తాపట్నాయక్

కొడంగల్, జనవరి 23 : కడా పరిధిలో ఇప్పటి వరకు మంజూరైన అభివృద్ధి పనులకు వెంటనే గ్రౌండింగ్ చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కడా కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ.. నిధులు మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. బీసీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బొంరాస్‌పేట, గుండుమాల్ మండలాల్లో చేపట్టే సమీకృత పాఠశాలల భవనాలు, ఆర్‌అండ్‌బీ ద్వారా చేపట్టే వెటర్నరీ వైద్య కళాశాలకు సంబంధించిన పనులను కూడా త్వరలోనే మొదలు పెట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు కళాశాలలకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు.

సమావేశంలో తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, నారాయణపేట ఆర్డీవో రాం చందర్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, ఈడబ్ల్యూఐడీసీ ఈఈ రాంకుమార్, డీఈ రాజు, ఇంజినీరింగ్ విభాగం ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి మతిమరుపు

- తీసుకున్న దరఖాస్తులనే ఎన్నిసార్లు తీసుకుంటారు
- నిర్బంధాల మధ్య గ్రామ, వార్డు సభలు
- ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయి
- ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



మీర్‌పేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జనవరి 23 : కాంగ్రెస్ ప్రభుత్వానికి మతిమరుపు ఉన్నదని.. తీసుకున్న దరఖాస్తులనే ఎన్నిసార్లు తీసుకుంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శంకుస్థాపనలు చేసిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణితో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు నిధులు కేటాయించడం లేదన్నారు. పార్టీలకు అతీతంగా పనిచేస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్ మంజూరు చేసిన నిధులను ఎందుకు రద్దు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు, జల్‌పల్లి మున్సిపాలిటీకి రూ. 25 కోట్లు, తుక్కుగూడ మున్సిపాలిటీకి రూ.25 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసినా.. వాటిని ఎందుకు రద్దు చేశారో చెప్పాలన్నారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులతో ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి తీసుకున్న దరఖాస్తులను బుట్టదాఖలు చేశారని ఆరోపించారు. ప్రజాపాలనలో.., ఇందిరమ్మ ఇండ్లు, కుల గణన సర్వేలు చేసి.. ప్రజల నుంచి ఆర్భాటంగా తీసుకున్న దరఖాస్తులు ఎక్కడున్నాయని ఆమె ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు , రేషన్ కార్డులు ఇస్తామని కాంగ్రెస్ సర్కార్ ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. వంద మందిలో పది మందికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి 90 మందితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు వేయించుకునేందుకు రేవం త్ సర్కార్ ఎత్తులు వేస్తున్నదని మండిపడ్డారు. నిర్బంధాల మధ్య గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఏ విధంగా పోలీసుల నిర్బంధం నిర్వహించారో.. ప్రస్తుతం గ్రామ, వార్డు సభలను కూడా అలాగే నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## 'పేదలకు అన్యాయం జరిగితే ఊరుకోను'

హిమాయత్‌నగర్ : పేదలకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ రోప్ పేరుతో పుట్‌పాత్‌లపై ఉన్న చిరు వ్యాపారుల షాపులను అధికారులు ఏకపక్షంగా తొలగించడంపై మండిపడ్డారు. 'అధికారులే సుప్రీం అనుకుంటే ఏట్లా..అలా చేస్తే ప్రభుత్వాలకు మనుగడ ఉండదు' అని అన్నారు. పుట్‌పాత్ కూల్చివేతలు మొదలు పెట్టాలంటే ముందుగా ఓల్డ్‌సిటీ నుంచి షురూ చేయాలన్నారు. అధికారులు ఒక చోట పనిచేస్తూ బదిలీలతో మరోచోటుకు వెళ్తారని.. ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా స్థానిక ప్రజాప్రతినిధులనే ఆశ్రయిస్తారన్నారు. ప్రభుత్వ పాలసీ ఉంటే ప్రజలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారంటూ మండిపడ్డారు. అధికారులు చేసే పనులతో ప్రజల్లో తాము తిరగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పుట్టింది, పెరిగింది రాజకీయ జీవితాన్ని ఇచ్చింది హైదరాబాదేనని, ఖైరతాబాద్ నియోజకవర్గానికే పరిమితం తాను కాదని.. నగరంలో ప్రజలకు ఎక్కడ ఇబ్బంది వచ్చినా.. తాను ముందుంటానని స్పష్టం చేశారు.